

ధరాఘాతం

నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతున్నాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు. 8లో▸



ప్రహరీ లేక.. పాట్లు

ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



రోడ్లన్నీ బురదమయం

ప్రస్తుతం కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలకు జిల్లాలోని రోడ్లన్నీ బురదమయంగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

అందుబాటులో ఉండండి

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న డీఎల్‌పీఓ, ఎంపీడీఓ

తాండూరు రూరల్: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎల్‌పీఓ శంకర్ నాయక్ సూచించారు. మండలానికి కొత్తగా వచ్చిన 9మంది పంచాయతీ కార్యదర్శులను బుధవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో పంచాయతీ కార్యదర్శులే కీలకమన్నారు. అనంతరం ఎంపీఓ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు అమీద్, వీరప్ప(అంతారం), లక్ష్మీకాంత్‌రెడ్డి (పర్వతాపూర్), నర్సిరెడ్డి(రాంపూర్ మీది తండా), రవీందర్(వీరారెడ్డిపల్లి), కృష్ణయ్య(మిట్టబాసుపల్లి), నసిరొద్దీన్(వీర్‌శెట్టిపల్లి), నరేష్‌గౌడ్ (గుండ్లమడుగు తండా), దినేష్ సింగ్(ఖాంజాపూర్), రవీందర్ (ఉద్దాండపూర్), అటెండర్లు సర్దార్, మహబుబ్ బీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఏపీఓ నరోత్తం రెడ్డి, ఈసీ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు లాలప్ప, అశోక్, ఆనంద్‌రావు, ఇస్మాయిల్, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప



యాలాల:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్ అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలకు బడ్జెట్ వల్ల ఎలాంటి లాభం లేదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అండగా నిలిచే ఉపాధి హామీ పథకానికి తక్కువ నిధు లు కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశా రు. ఉపాధి కూలీల వేతనం పెంపు, వ్యవ సాయ కార్మికుల వేతనం పెంపు తదితర అంశాలు బడ్జెట్‌లో లేకపోవడం సిగ్గుచేటన్నారు.

పక్షపాత ధోరణిని ఎండగట్టాలి

- కేంద్రం నుంచి నిధులు రాబట్టాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



మాట్లాడుతున్న మహిపాల్

అనంతగిరి: ఆంధ్రప్రదేశ్ తరహాలో తెలంగాణకు నిధులు తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ బీజేపీ రాష్ట్ర నేతలను డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి విధానాన్ని ప్రతి ఒక్కరూ ఎండగట్టాలన్నారు. మోదీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలన్నారు. బడ్జెట్ చూస్తే రెండు రాష్ట్రాల ప్రయోజనాలకే లాభం చేకూరేలా ఉందన్నారు. తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులు ఉన్నా నిధులు తేవడంలో విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సత్యనారాయణ, అక్బర్, నవీన్‌కుమార్, ముత్యం, అరవింద్ ఉన్నారు.

నేటి నుంచి జేఈ వ్యాక్సినేషన్

మొయినాబాద్ రూరల్: చిన్నారులకు మెదడువాపు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకా వేస్తున్నట్లు మండల వైద్యాధికారి అన్నపూర్ణ, మండల విద్యాధికారి వెంకటయ్య వెల్లడించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఏఎన్‌ఎంలకు జేఈ వ్యాక్సినేషన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ.. గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో మెదడువాపు వ్యాధి నివారణ టీకా వేయడం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొమ్మిది నెలలు పూర్తైన చిన్నారుల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు జేఈ టీకా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సారాఫాతిమా, ఫిర్దోష్‌బేగం, సాయిబాబా, దినేష్, సూపర్‌వైజర్ సునీతాదేవి, మనీష్, లక్ష్మి, నర్సింహ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంజనేయులు, మల్లయ్య, నర్సింహారెడ్డి, శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



పెసర పంటలో నిలిచిన వర్షపు నీరు

పొలాల్లో వర్షపు నీరు
సస్యరక్షణ చర్యలు

- యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలి
- తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ చౌరట్

తాండూరు: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. సుధాకర్ చౌరట్ సూచించారు. నిత్యం పంట యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. భారీ వర్షాల నుంచి వరి, పత్తి, కంది, పెసర, మినుము పంటలను కాపాడుకోవడానికి సలహాలు, సూచనలు చేశారు.

- రానున్న రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులు పంట పొలాల్లో మందులను పిచికారీ చేయడాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని.. రైతులు విద్యుత్ స్తంభాలు, తీగలు, చెరువులు, కుంటలకు దూరంగా ఉండాలి.
- నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు స్వల్పకాలిక (120 – 125 రోజులు) వరి రకాల నారుమళ్లు ఈ నెల 31లోపు పోసుకోవడానికి అనువైన సమయం.
- 30 – 35 రోజుల వయసున్న మధ్యకాలిక, స్వల్పకాలిక వరి రకాలను నాటుకోవాలి.
- దీర్ఘకాలిక వరి రకాల నారు బాగా ముదిరి (50 రోజుల వయసు) ఆలస్యంగా నాటినప్పుడు ఆకు చివరను తుంచి వేసి కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు 6 నుంచి 8 మొక్కలు చొప్పున నాటు వేయాలి. నత్రజని ఎరువులను సిఫారసు కంటే 25 శాతం పెంచి మూడు దపాలు, రెండు దఫాలుగా 70 శాతం నాటే సమయంలో.. మిగతా 30శాతం అంకురం దశలో వేసుకోవాలి.
- వరి నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాములు కార్బో ఫ్యూరాన్, 3కిలోల గుళికలను ఇసుకలో కలిపి చల్లితే ప్రధాన పొలంలో పంటను 15 – 20 రోజుల వరకు కొన్ని రకాల పురుగులు ఆశించకుండా పంటను కాపాడుకోవచ్చు.
- ఇప్పటి వరకు నారు పోయని రైతులు వర్షాలను సద్వినియోగం చేసుకొని పొలాలను దమ్ము చేసి వరి పంటను నేరుగా విత్తే పద్ధతిలో విత్తుకోవడం వలన సమయం, పెట్టుబడి ఆదా చేసుకోవచ్చు.
- నాటు పెట్టిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు కాలి బాటను తీయడం వలన గాలి వెలుతురును బాగా విస్తరించడంతో పాటు సుడి దోమ ఉధృతిని నివారించవచ్చు. రైతులు ఎరువులు, పురుగు మందులు పంటకు అందించడానికి సులువుగా ఉంటుంది.
- వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్, రసాయన ఎరువులను 20 రోజులు, 40 రోజుల వయసున్న పంటకు మొదళ్లలో 7–10 సెంటీ మీటర్ల దూరంలో పాదులుతీసి రసాయన ఎరువులను వేసి మట్టితో కప్పాలి.
- ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19,19,19 లేదా 13–0–45 లేదా 10 గ్రాముల యూరియాను లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ల నివారణకు 3 గ్రాముల కాపర్ – ఆక్సి క్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బెండజిమ్ మరియు మ్యాకోజెబ్ శిలీంద్ర నాశిక మందును లీటరు నీటిలో కలిపి నేల బాగా తడిచేట్టు వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.



డాక్టర్ సుధాకర్ చౌరట్

- పత్తి పంటలో వచ్చే గడ్డిజాతి, వెడల్పు ఆకు కలుపు మొక్కలను నివారణకు (రెండు నుంచి 3 ఆకుల దశలో ఉన్న కలుపు మొక్కలు) 2మి.లీ. క్విజలోపాప్ ఇథైల్, 1.25 మిలీ. పైరిథాయోబ్యాక్ సోడియం కలుపు మందులను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- మొక్క జొన్న పంటను ఈ నెల 31వ తేదీ వరకు స్వల్పకాలిక రకాలను దిగుబడిలో ఎటువంటి తరుగుదల లేకుండా విత్తుకోవడం అనుకూల సమయం.
- మొకాలు ఎత్తు దశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం మరియు 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడుల్లో వేసి కత్తెర పురుగును నివారించుకోవచ్చు.
- వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత వర్షాధార పంటకు పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి.

జొన్న పంట

ముందస్తు నివారణ చర్యల భాగంగా జొన్నలో కాండం తొలుచు పురుగు నివారణకు పంట విత్తిన 30 – 35 రోజుల దశలో ఎకరాకు 4 కిలోల కార్బో ఫ్యూరాన్, 3 సీజీల గుళికలను కాండం సుడుల్లో వేయాలి.

కంది పంట.. యాజమాన్య పద్ధతులు

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో పైటాఫ్లోర ఎండు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించిన వెంటనే నివారణకు 2 గ్రాములు మెటాలాక్సిల్ మందును లీటరు నీటిలో కలిపి నేల బాగా తడిచేటట్లుగా పిచికారీ చేయాలి.

సోయా చిక్కుడులో తెగుళ్ల నివారణకు..

సోయా చిక్కుడు పంటలో వేరు కుళ్లు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించిన వెంటనే నివారణకు 3 గ్రాముల కాపర్–ఆక్సి–క్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిసి నేల బాగా తడిచేటట్లుగా పిచికారీ చేయాలి. కాండం కుళ్లు తెగులు గమనిస్తే 2.5 గ్రాముల కార్బెండాజిమ్ మరియు మ్యాంకోజెబ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అధిక వర్షాల వలన 25 రోజుల తర్వాత పంటలో అంతర కృషి చేయడం వీలుకాని చోట 250 మి.లీ. ఇమాజితాపిర్ 10 శాతం ఎస్ఎల్ లేదా 40 గ్రాముల ఇమాజితాపిర్, ఇమాజమాక్స్ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసి గడ్డి మరియు వెడల్పు ఆకు కలుపు మొక్కలను నివారించాలి.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

‘ఆదర్శ’ంగా తీర్చిదిద్దాలి

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వసతులు కల్పించాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని వసతులు ఉండాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం మండలంలోని నాందార్‌పూర్, తుంకిమెట్ల, బొంరాస్‌పేటలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను పరిశీలించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నీచర్, ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన బాల స్వాస్థ్య కార్యక్రమంపై ఆరా తీశారు. అంతకుముందు మండల కేంద్రంలోని రైతు వేదికలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, అంగన్‌వాడీలకు బాల స్వాస్థ్య కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడారు. 0 నుంచి 18 ఏళ్ల వయసున్న పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, వంశపారంపర్యంగా వచ్చే లోపాలు, పెరుగుదల లోపాలు గుర్తించాలని సూచించారు. ఇంటింటి సర్వే చేసి లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించాలన్నారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఎంహెచ్‌ఓ పల్వాన్‌కుమార్, డీఐఏ బుచ్చిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, డాక్టర్ హేమంత్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు ఇవ్వండి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

- బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

యాచారం: నూతన రేషన్ కార్డులు ఇవ్వకుండా సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా తీసుకోవడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులు ప్రామాణికం పెట్టడం సరికాదని.. అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు రేషన్ సరుకులు, ఇండ్లు, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు ఇవ్వలేకనే రేవంత్ రెడ్డి సర్కార్ అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వం చేసిన మోసాన్నే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మండి పడ్డారు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మరిచారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉన్న భర్తీ చేయడం లేదన్నారు.

రుణమాఫీ బోగస్

రేవంత్‌రెడ్డి ప్రకటించిన రుణమాఫీ పెద్ద బోగస్ అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ అన్నారు. ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి నిబంధనలు, షరతులు లేకుండా రూ.2లక్షల రుణాలున్న రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా రూ.లక్ష లోపు రుణమాఫీలో 30 శాతం మంది రైతులకు కూడా మాఫీ వర్తించలేదన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ అయ్యప్పకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగని యాదయ్య, మేకల యాదగిరిరెడ్డి, గొల్లపల్లి జంగయ్యగౌడ్, పురుషోత్తం, రవీందర్ రెడ్డి, నడుకుడి కృష్ణ, విజయకుమార్, శ్రీధర్‌గౌడ్, శాంతికుమార్, పగుడాల శ్రీశైలం పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సీజనల్ వ్యాధులపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని.. వారిని వ్యాధులబారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం ఆయన వనమహోత్సవం, మహిళాశక్తి, సీజనల్ వ్యాధులపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి స్పెషల్ అధికారులు అందుబాటులో ఉంటూ రోజు వారీ పనులు విధిగా నిర్వహించాలన్నారు. తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యంపై ప్రతీ రోజు నివేదిక పంపించాలని డీపీఓకు సూచించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు.

ఫ్రైడే.. డ్రై డే

వైద్యారోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీ రాజ్ తదితర శాఖలు సమన్వయంతో పని చేస్తూ, సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరిస్తూ, అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని, వ్యాధుల పరిస్థితిపై రోజువారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టి ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, అన్ని ఇండ్లు, సంస్థల్లో నిలువ నీటిని, చెత్తను తొలగించాలన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ శశాంక

మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయండి

గ్రామాల వారీగా మహిళా సమాఖ్య సంఘాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా మహిళా శక్తి క్యాంటీన్లు, మైక్రో ఎంటర్ ప్రైజెస్, మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు పారదర్శకంగా ఉండాలని సూచించారు. బస్టాండ్ సమీపంలో, జనాల రద్దీ ఉన్నచోటును గుర్తించి క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, గిరిజన సంక్షేమ జిల్లా అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అటవీ అధికారి సుధాకర్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హై బీపీ

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బీపీ, షుగర్ పేషెంట్లు
- రెండింటితో బాధపడుతున్న మరి కొందరు
- పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు
- ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

వికారాబాద్: జిల్లాలో బీపీ, షుగర్ పేషెంట్లు రోజు రోజుకూ పెరుగుతున్నారు. ఈ రెండు వ్యాధులతో బాధపడుతున్న వారు లక్షకు చేరువయ్యారు. ఇది అధికారిక లెక్కలు మాత్రమే.. అనధికారికంగా రెండు లక్షల వరకు ఉండే అవకాశం ఉంటుంది. ఒక్కరిలోనే ఈ రెండు వ్యాధులు ఉన్న వారు 6,200 మంది ఉంటారని అధికారులు పేర్కొంటున్నారు. వీరికి ఏడాదిగా కాంబినేషన్ డ్రగ్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.అయితే మారుతున్న జీవన విధానం, పని ఒత్తిడి, ఉరుకులు పరుగుల జీవనం తదితర కారణాలతో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతూ పోతోందని వైద్యులు తెలిపారు. జీవన విధానం మార్చుకోవడం ద్వారానే ఈ రోగాల బారిన పడకుండా ఉండవచ్చని వారు సూచిస్తున్నారు.

లక్షకు చేరువలో పేషెంట్లు

వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో ప్రస్తుతం 65,000 మంది బీపీ పేషెంట్లు ఉండగా 32,000 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఈ రెండు కలిపి చూస్తే దాదాపు 97,000 మంది ఉన్నారు. ఒక్కరి లోనే రెండు వ్యాధులు ఉన్న వారు 6,200 మంది పైచిలుకు ఉన్నారు. వీరికి ప్రతినెలా ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. అయితే వాస్తవంలో ఈ గణాంకాలు రెండింతలు ఉండే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. చాలా మంది ప్రభుత్వ సర్వేలకు చెప్పకుండా ప్రైవేటుగా పరీక్షలు చేసుకుని మందులు వాడుతున్నట్లు తెలిసింది. తమ రోగాన్ని బయటకు చెప్పుకోవటం ఇష్టం లేక సర్వేల్లో లేని వారు సైతం ఇంతే మొత్తంలో ఉంటారని తెలుస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం షుగర్, బీపీ పేషెంట్లు జిల్లా జనాభాలో 10 శాతం ఉండగా అనధికారికంగా 20 శాతం వరకు చేరుకున్నారని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఉచితంగా కాంబినేషన్ డ్రగ్

బీపీ, షుగర్ రెండు రోగాలు ఉన్న వారికి కాంబినేషన్ డ్రగ్ అవసరం. గతంలో ఆ ట్యాబ్లెట్లు కొనుగోలు చేసే స్తోమత లేని పేదలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. గతేడాది వరకు ప్రభుత్వం షుగర్, బీపీ వేర్వేరుగా ఉన్న వారికి మాత్రమే మందులు ఉచితంగా పంపిణీ చేస్తూ వచ్చింది. దీంతో కాంబినేషన్ డ్రగ్ అవసరం ఉన్న వారు కొందరు బయట కొనుగోలు చేసే వారు. ఆర్థిక స్తోమత లేని వారు ఏదోలా కాలం ఎల్లదీశారు. దీంతో కిడ్నీ సంబంధ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రస్తుతం జిల్లా లో వికారాబాద్,పరిగి, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లో డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. ఇవి 24 గంటలు పని చేస్తున్నాయి. కిడ్నీ సంబంధిత రోగులు సంఖ్య కూడా పెరిగిపోతోంది. గత ఏడాది నుంచి ప్రభుత్వం కాంబినేషన్ డ్రగ్స్ పంపిణీ చేస్తోంది. దీంతో ఒక్కో రోగికి ప్రతినెలా రూ.1,500 వరకు లబ్ధి చేకూరుతోంది. కాంబినేషన్ డ్రగ్ ఉచితంగా పంపిణీ చేస్తుండటంతో భవిష్యత్‌లో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.



కాంబినేషన్ డ్రగ్‌పై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి

బీపీ,షుగర్ రెండు ఉన్న వా రికి ఏడాది నుంచి ప్రభు త్వం కాంబినేషన్ డ్రగ్‌ను ఉచితంగా పంపిణీ చేస్తోంది.ఈ మందుపై ఎంతమందికి అవగాహన ఉందో తె లుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరా లు సేకరించాం. చాలా మందికి అవగాహన ఉంది. బీపీ, షుగర్ రోగులకు కూడా ప్రతి నెలా మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ పల్వల్వాన్‌కుమార్, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

ఉత్తమ సేవకులకు అవార్డులు


అవార్డులతో నర్సింలు, బాలరాజ్

బంట్వారం: 108 అత్యవసర సేవల్లో ఉత్సాహం కనబర్చిన మెడికల్ టెక్నీషియన్ నర్సింలు, పైలెట్ బాలరాజ్‌లకు రాష్ట్ర స్థాయి అవార్డులు వరించాయి. ఈ మేరకు బుధవారం నగరంలోని 108 సంస్థ ప్రధాన కార్యాలయంలో స్టేట్‌హెడ్ ఎంఏ ఖలీద్ చేతుల మీదుగా 'లైఫ్ సేవియర్' అవార్డులను అందుకున్నారు. ఏప్రిల్, మే, జూన్ త్రైమాసంలో వీరి పని తీరును గుర్తించి రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక చేసినట్లు ఖలీద్ తెలిపారు. పీహెచ్‌సీ పరిధి నుంచి నర్సింలు, బాలరాజ్ జిల్లా స్థాయిలో ఎంపికై అవార్డులు పొందారని ఆయన వెల్లడించారు. ఇందులో ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్, వికారాబాద్ మేనేజర్ మహేశ్ ఉన్నారు

కేటీఆర్‌ను కలిసిన మాజీలు


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

కొడంగల్ రూరల్: అసెంబ్లీ ఆవరణలో బుధవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కొడంగల్, మక్తల్ మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఇందులో ఆ పార్టీ సీనియర్ నాయకుడు సలీం ఉన్నారు.

15 మంది జీపీ కార్యదర్శుల బదిలీ

తలకొండపల్లి: మండల పరిధి నుంచి 15 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారని ఎంపీడీఓ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఆయన పేర్కొన్నారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దూర్‌తండా కార్యదర్శి మహ్మద్ వాజిద్, జంగారెడ్డిపల్లిలో జానయ్య, తుమ్మలకుంటతండాలో శ్రీనివాస్, తలకొండపల్లిలో రాఘవేందర్, పాతకోటతండాలో రమేష్, చెన్నారంలో ఉమాదేవి, ఖానాపూర్‌లో అలివేలు, బల్సులపల్లితండాలో సందీప్‌కుమార్, చౌదర్‌పల్లిలో బాలురాజు, దేవుని పడకల్‌లో జంగయ్య, గడ్డమీదితండాలో విజయ్ కుమార్, గట్టుఇప్పలిపల్లిలో రాఘవేందర్, కోరింతకుంట తండాలో పరమేశ్వర్, పూల్‌సింగ్‌తండాలో పవన్‌రెడ్డి, వెంకటాపూర్‌లో గోరటి జంగయ్యలు బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చిన వారు.. పెద్దూర్‌తండాకు లింగస్వామి, జంగారెడ్డిపల్లికి లింగారెడ్డి, తుమ్మలకుంటతండాకు రాఘవేందర్, తలకొండపల్లికి జి.సత్యం, పాతకోటతండాకు గణేశ్, చెన్నారానికి ఎస్.రాజు, ఖానాపూర్‌కు వి.రాఘవేందర్‌లు ఆయా గ్రామాల్లో విధుల్లో చేరినట్లు ఆయన వెల్లడించారు.

స్టీల్ షాపులో చోరీ

మొయినాబాద్: దుండగులు షట్టర్ తాళాలు పగులగొట్టి స్టీల్, సిమెంట్ షాపులో చోరీ చేశారు. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమంగళారం గ్రామానికి చెందిన మందడి మధుసూదన్‌రెడ్డికి మొయినాబాద్‌లోని రాధాస్వామి సత్‌సంగ్ ఎదురుగా స్టీల్, సిమెంటు దుకాణం ఉంది. రోజులాగే మంగళవారం రాత్రి షాపు మూసి వెళ్లారు. బుధవారం తెల్లవారు జాము 3.45 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు షట్టర్ తాళాలు పగులగొట్టి షాపులోని టీవీ, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. యజమాని షాపు తెరిచే సమయానికి వచ్చి చూడగా.. తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న అనంతరం సీసీ కెమరాలను పరిశీలించారు. చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

ధరాఘాతం



ఉడకనంటున్న పప్పు దినుసులు

- అందనంటున్న కూరగాయలు
- ఆకాశన్నంటుతున్న బియ్యం ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజలపై భారం

దుద్యాల్: నిత్యవసరా సరకుల ధరలు నింగినంటుతున్నాయి. ఒకదానికి ఒకటి పోటీపడి అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న ధరలతో సామాన్యుడు విలవిలాడుతున్నాడు. నియంత్రించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటంతో.. 'ఏం కొనేటట్లు లేదు.. ఏం తినేటట్లు' లేదంటూ వాపోతున్నారు. వచ్చే ఆదాయం కంటే వ్యయం ఎక్కువవుతుందంటూ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గడిచిన మూడు నెలలుగా కూరగాయాలు, బియ్యం, పప్పుదినుసులు, మాంసాహారాలు ఇలా సగటు మనిషికి అవసరమయ్యే సామగ్రి ఏదైనప్పటికీ.. ధరలు పెరిగి పేద, మధ్య, దిగువ తరగతి కుంటుంబాలను ఇరుకున పడేస్తున్నాయి.

పచ్చడి మెతుకులు కష్టమే

ఏం కూరగాయలు కొనాలన్నా కిలో రూ.80 ఆపై రేటు పలుకుతోంది. ఇక పప్పు దినుసులు నా దగ్గర మీ పప్పులేం ఉడకవంటూ వెక్కిరిస్తున్నాయి. మాంసాహారాలు, బియ్యం తదితర సామగ్రి వాటి సరసనే చేరాయి. దీంతో కూర వండుకు తినలేక.. చారు చేసుకుందామన్నా కష్టంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పోనీ పచ్చడి మెతుకులతో సరిపెట్టుకుందామనుకున్నా.. నూనె, వాటికి కావలసిన సామగ్రి కొనుగోలు చేయలేని దుస్థితి. ప్రస్తుతం కంది పప్పు బహిరంగ మార్కెట్లో కిలో రూ.195 వరకు పలుకుతుంది. అలాగే సన్న రకం బియ్యం కిలో రూ.65 నుంచి రూ.70, దొడ్డు బియ్యం రూ.55 నుంచి రూ.60 వరకు పలుకుతుంది. ఇలా ధరలు పైకి ఎగబాకుతుండటంతో సామాన్యులకు కష్టంగా మారింది. బతకాలంటే తినక తప్పదని కొద్దోగొప్పో కొనుగోలు చేయక తప్పడం లేదని వాపోతున్నారు.


సన్న బియ్యం


కంది పప్పు

ధరలను నియంత్రించాలి



పెరుగుతున్న ధరలతో భయంగా ఉంది. తప్పక తినాల్సిన పరిస్థితి కావడంతో కొనక తప్పడం లేదు. కొంత కాలంగా చూసుకుంటే కూరగాయల రేట్లు స్థిరంగా ఉన్నాయి. పప్పు చారు చేసుకుందామనుకున్నా.. వాటి ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఏం కొని తినాలో అర్థం కావటం లేదు. ప్రభుత్వం ధరలను నియంత్రించి, ప్రజలను ఆదుకోవాలి.

– లక్ష్మి, గృహిణి, హస్నాబాద్

గ్రామ సంరక్షణ గాలికి

పేరుకుపోతున్న చెత్తచెదారం

పెద్దేముల్: అపరిశుభ్రతతో పల్లెల కళ మసకబారగా.. ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారింది. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక పరిసర ప్రాంత ప్రజలు దిక్కులు చూస్తున్నారు. పెద్దేముల్ గ్రామం 4, 5 వార్డుల్లో వీధుల్లో చెత్తచెదారం పేరుకుపోయింది. పిచ్చి మొక్కలతో మురుగు కాలువలు నిండి, వ్యర్థ జలాలు ముందుకు సాగని దుస్థితి ఏర్పడింది. ఉన్న పంచాయతీ కార్యదర్శి బదిలీపై వెళ్లగా.. కొత్తగా ఎవరినీ నియమించలేదు. ముందే సర్పంచ్ లేడు. ఇప్పుడు కార్యదర్శి లేడు. దీంతో గ్రామ సంరక్షణ పట్టించుకునే వారు లేక.. సమస్యలు పేరుకుపోతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అపరిశుభ్రత వలన దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలం.. దీనికి అపరిశుభ్రత తోడు కావడంతో రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతికి కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు.


పిచ్చిమొక్కలతో నిండిన మురుగు కాలువ

నాటడమే కాదు.. కాపాడాలి

నవాబుపేట: నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలని డీఆర్డీఏ శ్రీనివాస్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడమే కాదు, వాటిని పెంచి పెద్ద చేయాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. అందుకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలని, విద్యుత్ వైర్ల కింద నాటొద్దని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, సూపరింటెండెంట్ అజయ్ కుమార్, ఎంపీఓ విజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఏపీఓ లక్ష్మీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు

బాల కార్మికులకు విముక్తి

శంకర్‌పల్లి: దుకాణాల్లో పని చేస్తున్న ఐదుగురు బాల కార్మికులకు ఆపరేషన్ ముస్కాన్ టీం విముక్తి కల్పించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్కాన్ టీం బుధవారం శంకర్‌పల్లి పట్టణంలో పర్యటించింది. పలు దుకాణాలు, హోటళ్లలో పని చేస్తున్న ఐదుగురు బాల కార్మికులను గుర్తించింది. అనంతరం వారికి టీం సభ్యులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. పిల్లలను పనిలో పెట్టుకున్న దుకాణాలపై జువెనైల్ జస్టిస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో కఠినంగా శిక్షిస్తామని ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి హెచ్చరించారు.

బెకరీలో ఒకరు..

ఇబ్రహీంపట్నం రూరల్: బేకరీలో పని చేస్తున్న బాల కార్మికుడికి పోలీసులు విముక్తి కల్పించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధి తుర్కయంజాల్‌లో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోయపల్లి రవికుమార్ తుర్కయంజాల్‌లో బెకర్స్ హబ్ బేకరీ నిర్వహిస్తున్నాడు. ఇందులో బాలుడు(15)తో పనిచేయించుకుంటున్నాడు. సమచారం మేరకు ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా పోలీసులు తనిఖీ చేసి, బాలుడిని జువైనల్ హోంకి తరలించారు. దుకాణ యజమానిపై కేసు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంపెనీలో..

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి వైఎస్‌ఆర్ నగర్ సమీపంలోని ఓ తయారీ కంపెనీలో వెస్ట్‌బెంగాల్‌కు చెందిన బాల కార్మికుడు(15)కి పోలీసులు విముక్తి కల్పించారు. అనంతరం యజమాని ముత్యాల శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బాలున్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీ

సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు సీజ్

మీర్‌పేట: రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీఐ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నందనవనం, భూపేష్‌గుప్తానగర్, వాంబేకాలని, ఇంద్రసేనారెడ్డినగర్, మజీద్‌గల్లీలో తిరుగుతూ కిరాణాషాపులను తనిఖీ చేశారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న పండగలు, ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. అదే విధంగా నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏసీపీ కాశిరెడ్డి, సీఐ నాగరాజు

ప్రహరీ లేక.. విద్యార్థుల పాట్లు

- మందుబాబులకు అడ్డాగా కళాశాల ప్రాంగణం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

దోమ: ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కనీస రక్షణ లేకపోవడంతో సరస్వతీ నిలయాల ప్రాంగణాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మూగజీవాలు సంచరిస్తున్నాయి. ఆవరణలో నాటిన మొక్కలు వాటికి మేతగా మారుతున్నాయి. ఇదే విషయం సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు, అధ్యాపకులు ఆరోపిస్తున్నారు.

మైదానంలో మద్యం సీసాలు

దోమ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కానీ కళాశాలకు ప్రహరీ నిర్మించకపోవడంతో.. విద్యార్థులు అభద్రతా భావంతో ఉన్నారు. చుట్టూ గోడ లేని కారణంగా పశువులు సంచరించడంతో పాటు.. ఆకతాయిలకు అడ్డాగా మారిందని విద్యార్థులు తెలిపారు. కళాశాల మైదానంలో నిత్యం మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు, పాలకులు స్పందించి కాలేజీ చుట్టూ గోడను నిర్మించాలని కోరుతున్నారు.


ప్రహరీ లేని కళశాలలో మైదానం

బస్టాప్ ఏర్పాటు చేయండి

జూనియర్ కళాశాలలో మండల పరిధి విద్యార్థులు అనేక మంది చదువుకుంటున్నారు. అయితే కళాశాల వద్ద బస్‌స్టేజి లేని కారణంగా.. దోమ చౌరస్తాలో దిగి కిలో మీటర్ దూరాన ఉన్న కాలేజీకి రావాలంటే ఇబ్బందిగా ఉందని, కళాశాల పక్కనే దోమ, పరిగి రహదారి ఉన్నప్పటికీ బస్సులు ఆపడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కళాశాల ఎదురుగా బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


దోమ ప్రభుత్వ జూనియర్ కళాశాల

సౌకర్యాలు కల్పించాలి



కళాశాలకు ప్రహరీ నిర్మించి, తగిన సౌకర్యాలు కల్పించాలి. గోడ లేకపోవడం వలన కాలేజీ ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కళాశాలకు వచ్చే మార్గంలోనే వైన్ షాపు ఉంది. మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. మైదానంలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. వెంటనే తగిన చర్యలు తీసుకుని, ప్రహరీని నిర్మించి, రక్షణ కల్పించండి.

– నందిని, సీఈసీ, ద్వితీయ సంవత్సరం, దోమ

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



కళాశాలకు ప్రహరీ లేక.. మందుబాబులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యక్రమాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీని వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, చుట్టూ గోడ నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– మంజుల, ప్రిన్సిపాల్, దోమ

గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితుడు

షాద్‌నగర్: గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఎలికట్ట గ్రామ శివారు పారిశ్రామిక ప్రాంతంలో తరుణ్‌జోష్ జైన్ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐలు శ్రీను నాయక్, సునీత, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో గంజాయి విక్రయిస్తున్న తరుణ్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు, నిందితుడి నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తరుణ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మంచాల: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి నోముల గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ బబ్యా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా, లక్ష్మీదేవి పల్లి మండలం, బంగారు చెలక్క గ్రామానికి చెందిన గోధుమల కుమార్(30) నోముల గ్రామంలోని తిరుమల ఆయిల్ మిల్‌లో పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడ్డారు. అనంతరం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన కుమార్.. సోమవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాచకుడి మృతి

కేశంపేట: యాచకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాగేశ్వర్‌రావు పాటిగడ్డ గ్రామ పరిసరాల్లో నెల రోజులుగా రోడ్ల వెంట తిరుగుతూ.. భిక్షాటన చేస్తున్నాడు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చలికి తట్టుకోలేక మృతి చెందాడు. బస్‌షెల్టర్‌లో ఉన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు

నాటుసారా పట్టివేత, ముగ్గురి అరెస్టు

ఆమనగల్లు: ఎక్సైజ్ పోలీసులు దాడులు విస్తృతం చేశారు. కడ్తాల్, మాడ్గుల మండలాల్లో బుధవారం ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో 13 లీటర్ల నాటుసారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల మండలం రాందుగ్యాల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం అగ్రహారంతండాకు చెందిన నేనావత్ రఘు ద్విచక్ర వాహనంపై 5 లీటర్ల సారాను తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, రఘును అరెస్టు చేశారు. కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం వెనుక భాగంలో సారా విక్రయిస్తున్న రెండు దుకాణాలపై దాడీ చేశారు. ఈ ఘటనలో రామావత్ సోన, ఇస్లావత్ దోళీల వద్ద 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. అదే విధంగా వివిధ కేసుల్లో ఉన్న ఇద్దర్ని కడ్తాల్ తహసీల్దార్ వద్ద ఒకరిని, తలకొండపల్లి తహసీల్దార్ మరొకరిని బైండోవర్ చేశారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు అరుణ్‌కుమార్, కృష్ణప్రసాద్, స్వప్న, సిబ్బంది శంకర్, దశరథ్, బాబు, శ్రీజ, ప్రవీణ్, లోక్య పాల్గొన్నారు.


ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

భయం.. భయం..


అప్పారెడ్డిగూడలో ఇళ్ల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పొంచి ఉన్న ప్రమాదాలు

నందిగామ: ఎలాంటి రక్షణ కల్పించకుండా రహదారుల పక్కన, నివాసాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉందని, విషయం తెలిసినా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. జనవాసాలకు దూరంగా నియంత్రికలు ఏర్పాటు చేయాలని, తప్పనిసరి అయితే చుట్టూ కంచె ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటి చర్యలేవి చేపట్టకుండా విద్యుత్ అధికారులు ఇష్టంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రోడ్లు, ఇళ్లు, పాఠశాలలు, రద్దీ ప్రదేశాల్లో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో అనేక ప్రమాదాలు జరిగాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

జరిగిన ప్రమాదాలు

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుదాఘాతానికి గురై ఓ పాడి పశువుతో పాటు వీర్లపల్లిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మామిడిపల్లిలో ఒకరు విద్యుత్ షాక్‌తో తన చేతి వేళ్లను కోల్పోయాడు. సర్వప్పగూడలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేయడానికి వెళ్లి వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఇలా నిత్యం ఎక్కడో ఓచోట ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తగిన రక్షణ చర్యలు చేపట్టడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఎక్కడెక్కడ అంటే..


మేకగూడలో రోడ్డు పక్కన

మేకగూడలో బస్టాప్ సమీపాన, చేగూరు తిమ్మాపూర్ రోడ్డు, వీర్లపల్లిలో మామిడిపల్లి రోడ్డుకు ఆనుకుని, అప్పారెడ్డిగూడలో వీర్లపల్లి రోడ్డుకు, మండల కేంద్రమైన నందిగామలో పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కంచెలు మరిచారు. ఇలా ఏర్పాటు చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. రక్షణగా చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టండి

సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ నాగమణి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధి లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో అక్రమ రవాణా నిర్మూలనపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో సీడీపీఓ మాట్లాడారు. మానవ రవాణా పెద్ద నేరమని, నిత్యం ఎంతో మంది అబలలు చీకటి కోణంలోకి నెట్టివేయబడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఉద్యోగం, ప్రేమ వివాహం, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. తమ వంతు బాధ్యతగా అంగన్‌వాడీ టీచర్లు తమ పరిధిలోని మహిళలు, అమ్మాయిలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు. తరలింపు సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

పునరావాసం కల్పించాం

మానవ రవాణాను అరికట్టేందుకు తమ సంస్థ 28 సంవత్సరాలుగా కృషి చేస్తుందని స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆ ఉచ్చులో బిగుసుకున్న వారిని కాపాడి, పునరావాసం కల్పించామని వెల్లడించారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసుకొని, అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం అధికారిణి మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, వెంకటమ్మ, ప్రజ్వల సిబ్బంది అనిల్‌కుమార్, మిథాలిరాజ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ నాగమణి